క్లుప్తంగా

కనులపండువగా మహా పడిపూజ



పడిపూజ చేస్తున్న గురుస్వామి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో శనివారం రాత్రి కనులపండువగా మహాపడి పూజ నిర్వహించారు. కేరళకు చెందిన శ్రీసజీవ్ నంబూద్రి గురుస్వామితో ఉదయం శ్రీఅయ్యప్పస్వామి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు చేసి రాత్రి స్వామివారి 18 మెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 18పడులను వెలిగించి హారతి, తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, కోశాధికారి కండెం సురేశ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ గ్రామసభలు



జూలపల్లిలో గ్రామసభ నిర్వహణ

కమాన్‌పూర్: మండలంలోని కమాన్‌పూర్, సిద్దిపల్లె, జూలపల్లి, గొల్లపల్లె గ్రామాల్లో ఆదివారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనుల వివరాలు, చేసిన ఖర్చు, కూలీల వివరాలు తెలిపారు. గ్రామసభల్లో సర్పంచ్‌లు నీలం సరిత, తాటికొండ శంకర్, బొల్లపెల్ల శంకర్‌గౌడ్, శీలారపు అనిత, ఎంపీటీసీ శెవ్వ శంకరయ్య, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఉపాధిహామీ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూజలు



ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం గుంటూరుపల్లి గ్రామంలో ఆదివారం గ్రామ దేవతలు పోచమ్మ కొలువులు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు బొడ్రాయి వద్ద ఏర్పాటు చేసిన గ్రామ దేవతల విగ్రహాలకు భక్తులు పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గ్రామ సర్పంచ్, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో పాల్గొన్న వైద్యులు

కమాన్‌పూర్: మండలంలోని పేరపల్లి గ్రామంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పెద్దపల్లి వారి ఆధ్వర్యంలో పేరపల్లి, సబ్బితం గ్రామాలను దత్తత తీసుకొని ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 25 మంది వైద్యులు పాల్గొని సుమారు 200మందికి పైగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. సీపీఆర్‌పై పలువురికి ట్రైనింగ్ ఇచ్చారు. సర్పంచ్ తొగరి అన్నపూర్ణ, వైద్యులు మందల వాసుదేవరెడ్డి, శ్రీదేవి, రమాకాంత్, కృష్ణారెడ్డి, మల్లేశం, వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, శ్రీదేవి, ప్రియాంక, లావణ్య పాల్గొన్నారు.

వైభవంగా అమ్మభగవాన్ కల్యాణ మహోత్సవం



అమ్మ భగవాన్ కల్యాణ వేడుకలు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం శ్రీఅమ్మ భగవాన్ కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. శ్రీఅమ్మ భగవాన్ సేవాసమితి నిర్వాహకులు నార్ల పద్మ–సంపత్ నేతృత్వంలో స్వామివార్లకు ఒడిబియ్యం, సారె చీర, కట్నకానుకలు సమర్పించారు. నార్ల విజయలక్ష్మి రాజన్న, పారుపెల్లి వనజ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు వధూవరులుగా వ్యవహరించారు. సేవాసమితి నాయకులు గోలి కృష్ణమూర్తి, సుధాకర్, బోయిని సదానందం, అంబాల తిరుపతి, పురుషోత్తం, జిలుకర రమేశ్, అల్లంల రాజయ్య, అఖిల్, మల్లేశం పాల్గొన్నారు.

108 సేవలు అంతంతే

- వైఎస్సార్ నాటి అంబులెన్సు.. తరచూ మరమ్మతు
- నెలన్నరరోజులుగా అందని సేవలు
- ఇబ్బందుల్లో మంథని ప్రజలు
- నూతన వాహనానికి మోక్షమెన్నడో?



108 వాహనం

“ భూపాలపల్లికి చెందిన అల్లనూరి సమ్మయ్య, ఆయన భార్య పుల్లమ్మ బైక్‌పై మంచిర్యాల నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో బట్టుపల్లి వద్ద గుర్తు తెలియని ఆటో ఢీకొనడంతో రోడ్డుపక్కకు పడిపోయారు. దారి వెంట వెళ్తున్న స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. కానీ ప్రస్తుతం 108 వాహనం అందుబాటులో లేదని, అక్కడకు రావడానికి ఆలస్యమవుతుందని చెప్పారు. స్థానిక సామాజిక వైద్యశాలకు సమాచారం ఇవ్వగా ఆ వాహనం వచ్చేలోపే ఓ ప్రైవేటు వాహనంలో క్షతగ్రాత్రులను ఆస్పత్రికి తరలించారు.

మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఈ నెల 2న మండలంలోని సూరయ్యపల్లికి చెందిన వడ్లకొండ శ్రీనివాస్ బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొనడంతో బలమైన గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించేందుకు 108కి సమాచారం అందిస్తే అందుబాటులో లేదని చెప్పారు. దీంతో ప్రైవేటు అంబులెన్స్ ద్వారా స్థానిక సామాజిక వైద్యశాలకు తరలించగా మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఈ నెల 3న మంథని మండలం స్వర్ణపల్లిలో కోరవేన రాజయ్య పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా 108కు ఫోన్ చేశారు. మంథనిలో వాహనం అందుబాటులో లేదని, గోదావరిఖని నుంచి రావడానికి ఆలస్యమవుతుందని చెప్పడంతో ప్రైవేటు వాహనంలో మంథని సామాజిక వైద్యశాలకు తీసుకురాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇలా అత్యవసర సమయాల్లో 108 వాహన సేవలు అందుబాటులో లేకపోవడంతో అనేక అనర్థాలు జరుగుతున్నాయి. ”

మంథని: మంథని డివిజన్ ప్రజలకు 108 సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. వాహనం తర చూ మరమ్మతుకు వస్తుండడంతో సమీపంలో ఉన్న వాహనాలు సకాలంలో చేరడం లేదు. నెలన్నర రోజుల నుంచి మంథని 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో, కమాన్‌పూర్, పెద్దపల్లి, గోదావరిఖని వాహన సేవలు వినియోగిస్తున్నారు. ఇవి సకాలంలో చేరకపోవడంతో 108 సేవలు పేదప్రజలకు అందడం లేదు.

తరచూ మరమ్మతు..

2007లో మంథనికి 108 వాహనం కేటాయిస్తే ఇప్పటికీ కొత్త వాహనం సమకూర్చలేదు. మరమ్మతుకు వచ్చినప్పుడల్లా బాగు చేసిన పాత వాహనాన్నే ఇక్కడికి పంపిస్తున్నారు. ఇలా సుమారు 6 పాత వాహనాలనే అత్యవసర సేవలకు వినియోగించారు. మరమ్మతుకు రావడం.. బాగు చేసి పంపడం పరిపాటిగా మారింది. తరచూ సేవలకు అంతరాయం కలుగుతుండడంతో రోగులకు అసౌకర్యం తప్పడం లేదు. మంథనిలో వాహనం అందుబాటులో లేక గోదావరిఖని, పెద్దపల్లి 108 వాహనం ఇక్కడి రోగులకు సేవలందించాల్సిన పరిస్థితి. ఆ ప్రాంతంలో ఆ సమయంలో ఏదైనా కాల్‌లో వాహనం ఉంటే ఇక్కడికి రావడం ఆలస్యమవుతోంది. అంతేగాకుండా జిల్లాలోని 108 అంబులెన్స్ సేవలను గోదావరిఖనిలోని మెడికల్ కాలేజీ నుంచి వరంగల్ ఎంజీఎం, హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి వినియోగిస్తున్నారు. దీంతో అత్యవసర సమయాల్లో సమీపంలోని వాహనాలు కూడా అందుబాటులో ఉండడం లేదు.

మూడు మండలాలకు సేవలు

మంథని, ముత్తారంతో పాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మల్హర్ మండలానికి మంథని 108 వాహనం సేవలందిస్తుంది. నెలకు 100 నుంచి 120 కాల్స్ అటెండ్ చేస్తూ సేవలందిస్తుంది. 30 నుంచి 40 కిలోమీటర్లు సేవలందించే వాహనం పాతది కావడంతో తరచూ మరమ్మతుకు వస్తోంది. కాగా మంథనితో పాటు పాలకుర్తి, గోదావరిఖని వాహన సేవలకు కూడా అంతరాయం ఏర్పడినట్లు సమాచారం.

కొత్త వాహనం పేరుతో పాతది పక్కకు

108 అంబులెన్స్ సేవలను ఇటీవల ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ టెండర్ దక్కించుకుంది. ఈ క్రమంలో 3లక్షల కిలోమీటర్లు దాటిన, మరమ్మతుకు చేరిన చోట కొత్త వాహనాల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసింది. మంథనికి నూతన వాహనం సమకూర్చే క్రమంలో పాత వాహనానికి మరమ్మతు కూడా చేయించకుండా పక్కకు పెట్టడంతో నెలకుపైగా ఇక్కడి సేవలకు అంతరాయం కలుగుతోంది. నూతన వాహనం ఇక్కడకు పంపించాలని స్థానికులు కోరుతున్నారు.

పల్లె ప్రజలకు మెరుగైన సౌకర్యాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేకదృష్టి సారించామని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు కాలనీవాసులు డప్పుచప్పుళ్లతో స్వాగతం పలికారు. పెద్దపల్లి మండలం కొత్తపల్లిలో ఎస్సీకాలనీ వాసులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న శుద్ధ జలకేంద్రాన్ని ప్రారంభించడంతో పాటు రూ.45లక్షల వ్యయ అంచనాలతో చేపట్టిన సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. రైల్వేలెవల్ క్రాసింగ్ 37వ నెంబరు గేటు మూసి ఉంచడంతో తలెత్తుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఫుట్‌పాత్ ఏర్పాటుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. సర్పంచ్ చిలారపు సత్యం, టీఎస్ జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, విండో చైర్మన్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ సాయికృష్ణ, నాయకులు పల్లె సదానందం, సతీశ్, శంకర్, శివశంకర వరప్రసాద్, హన్మంతు, విజయ్, కనకయ్య, వంశీకృష్ణ, రాజేందర్, రాజు, కనుకుంట్ల సదానందం, వెంకటేశ్, నర్సయ్య, మల్లేశం పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

జూలపల్లి: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లెలో దివంగత కొమ్మరాజు స్మారకార్థం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఎంపీపీ రమాదేవి, సర్పంచ్ రేచవేని రాధ, వైస్‌చైర్మన్ రమేశ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో మందులు, వైద్య పరీక్షలను పరిశీలించారు. ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని వివరించారు. రాబోయే రోజుల్లో ప్రజలంతా బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మ సతీశ్, కొమ్మ భూమయ్య, రాంగోపాల్‌రెడ్డి, కరీంనగర్‌లోని కార్తీక్ హాస్పిటల్ వైద్యులు పాల్గొన్నారు.

రాఘవాపూర్‌లో ఎమ్మెల్యే పూజలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామంలోని ఎల్లమ్మ తల్లి ఆలయంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయ ప్రహరీ పనులను ప్రారంభించారు. గ్రామంలోని దర్గా వద్ద చదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. జెడ్పీటీసీ రామ్మూర్తి, సర్పంచ్ ఆడెపు వెంకటేశం, ఎంపీటీసీ శ్రీనివాస్, మర్కు లక్ష్మణ్ ఉన్నారు.

ఉద్యమకారుల సమ్మేళనం విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఉద్యమకారులు

జూలపల్లి: మండల కేంద్రంలో 12న నిర్వహించే తెలంగాణ సాధన ఉద్యమకారుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సీనియర్ ఉద్యమకారులు, బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షులు కొండపల్లి కృష్ణమూర్తి, నాడెం మల్లారెడ్డి, అమరగాని శ్రీనివాస్ కోరారు. జూలపల్లి కళాశాల వద్ద ఆదివారం సమావేశమై ఎన్నికలకు ముందు ఉద్యమకారుల పాత్రపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఉద్యమకారులు బుధవారం జూలపల్లిలో నిర్వహించే సమ్మేళనంలో కలుసుకుని ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి ఎవరికి టికెట్ ఇచ్చినా భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యాచరణ చేపట్టాలని చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే కమిటీ నియామకం చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో కోడూరి నాగరాజు, తుమ్మ రాజు, పాటకుల అనిల్, తీగెల అంజయ్య, కామరాజు, లాల్‌మహ్మద్ ఉన్నారు.

గంగమ్మకు బోనాలు



బోనాలతో మహిళలు

మంథని: మంథని మండలం పోతారంలో గంగపుత్రులు ఆదివారం గంగమ్మకు బోనాలు సమర్పించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా నిశాంత్

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన తుమ్మ నిశాంత్‌ను జాతీయ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా జాతీయ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు కొండ రామ్మోహన్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన రామ్మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

✦ఆర్థికసాయం అందజేత

కమాన్‌పూర్: రామగిరి మండలం లొంకకేసారం గ్రామానికి చెందిన కారుపాకల సతీశ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, అతడి కుమారుడు సిద్ధార్థ చికిత్స పొందుతూ మృతిచెందాడు. సతీశ్ కుటుంబానికి ప్రగతి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు రూ.4వేల నగదుతో పాటు ఫొటో ఫ్రేమ్‌లు అందజేశారు. సభ్యులు కొత్త నరేశ్, వేగోళపు శ్రీకాంత్, కుడికాలు రమేశ్, జ్యోతికుమార్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

✦తాజోద్దీన్ సేవాసమితి కార్యవర్గం

మంథని: మహారాష్ట్రలో ప్రసిద్ధిగాంచిన హజరత్ సయ్యద్ మొహమ్మద్ బాబా తాజోద్దీన్ సేవా సమితికి మంథనిలో కార్యవర్గం ఎన్నుకున్నారు. మంథని అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఐసాన్, రాజబాపు, ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్, జకీర్, సంయుక్త కార్యదర్శులుగా అస్లం, మహేందర్, కోశాధికారిగా శ్రీనివాస్ ఎన్నుకున్నారు.

✦జనంలోకి జనసేన

గోదావరిఖని: జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక లక్ష్మీనగర్‌లో గడపగడపకూ వెళ్లి ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. రామగుండం నియోజకవర్గం ఇన్‌చార్జి మూల హరీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగారు. నాయకులు రావుల సాయికృష్ణ, గోపి కృష్ణ, ఏముర్ల రంజిత్, ఉదయ్‌రెడ్డి, మంథని శ్రావణ్, మేకల సంతోష్, రాసూరి హరికృష్ణ, వడ్డేపల్లి రాకేశ్, రావుల పవన్, బండారి తిరుపతి, రవికాంత్, మనోజ్ పాల్గొన్నారు.

✦ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సుల్తానాబాద్‌రూరల్: బీజేపీ ఆధ్వర్యంలో ప్రజల సమస్యలను పరిష్కారించేందుకు కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం ఐతరాజుపల్లి గ్రామంలో బ్రేక్ ఫాస్ట్ విత్ జీఎస్సార్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ నాయకులు సంతోష్‌రెడ్డి, రాజశేఖర్, అరవింద్, రాజ్‌కుమార్, రమేశ్, సతీశ్, లింగయ్య, నారాయణరెడ్డి, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

✦టార్పాలిన్లు అందజేత

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలకు కేసీఆర్ సేవాదళం సభ్యుడు జెట్టి సతీశ్ టార్పాలిన్లు అందజేశారు. కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొద్దుల లక్ష్మణ్ ఆదేశాలతో గ్రామానికి చెందిన కంది లచ్చమ్మ, కన్నం స్వామికి చెందిన పాత ఇండ్లు వర్షాలకు ఉరవడంతో ఉండలేకపోతున్నామని సేవాదళం సభ్యులకు తెలియజేయడంతో ఇళ్లపై కప్పేందుకు టార్పాలిన్లు అందజేశారు. నాయకులు వేల్పుల గట్టయ్య, బొల్లపల్లి అంతయ్య, జెట్టి రాజయ్య, కంది శ్రీధర్, సాగర్, రేషవేని మల్లేశం, బుచ్చయ్య ఉన్నారు.

✦బ్రహ్మ గర్జన సభకు తరలిన బ్రాహ్మణులు

కాల్వశ్రీరాంపూర్: హైదరాబాద్ సరూర్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన బ్రహ్మగర్జన సభకు కాల్వశ్రీరాంపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బ్రాహ్మణులు కుటుంబ సభ్యులతో సహా తరలివెళ్లారు. బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి స్పందిస్తూ హైదరాబాద్ సభకు వచ్చిన బ్రాహ్మణ సోదరులకు బ్రాహ్మణ సేవాసంఘం మండల కోఆర్డినేటర్ అంబరీష్ శర్మ, రాజేందర్ శర్మ కృతజ్ఞతలు తెలిపారు.

నిధులు మంజూరైనా.. పనులు చేపట్టలేదు



బ్రిడ్జిని పరిశీలిస్తున్న సర్పంచ్ పల్లె ప్రతిమ

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని రత్నాపూర్ నుంచి రామగిరి ఖిల్లాకు వెళ్లే ప్రధాన రహదారిలో ఎస్సారెస్పీ ఆర్‌ఎస్‌బీ కెనాల్‌పై ఉన్న పురాతన బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరైనా పనులు ప్రారంభించడం లేదని సర్పంచ్ పల్లె ప్రతిమ అన్నారు. బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.21.63 లక్షల నిధులు మంజూరై టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. బ్రిడ్జి ఎప్పుడు కూలుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారని సర్పంచ్ పేర్కొన్నారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి



మాట్లాడుతున్న టూటౌన్ సీఐ వేణుగోపాల్

యైటింక్లయిన్‌కాలనీ: నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని గోదావరిఖని టూటౌన్ సీఐ వేణుగోపాల్, రెండో సీఐ అఫ్జలోద్దీన్ అన్నారు. రామగిరి మండలం వెంకట్రావుపల్లి కేకేనగర్‌లో ఆదివారం సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేశారు. సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్ లేని 60 బైక్‌లు, 4 ఆటోలు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు వెల్లడించారు. పలు వాహనాలకు జరిమానా విధించారు. సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులు కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా మహిళలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే షీ టీం నెంబర్ 63039 23700, సైబర్ క్రైమ్ నెంబర్ 1930కు ఫోన్ చేస్తే తక్షణమే పరిష్కారం లభిస్తుందన్నారు. టూటౌన్ ఎస్సైలు చంద్రశేఖర్, ఫరీద్, కమాన్‌పూర్ ఎస్సై బేతి రాములు పాల్గొన్నారు.



జ్యోతినగర్: బోనాలు సమర్పిస్తున్న భక్తులు

ఘనంగా పోచమ్మ బోనాలు



ధర్మారం: బోనాలతో మహిళలు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ మేడిపల్లి గ్రామంలో ఆదివారం రజక సేవా సంఘం అధ్యక్షుడు పూసాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోచమ్మకు, మడేలయ్యకు మహిళలు బోనాలు సమర్పించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన బీసీ కులవృత్తుల కోసం రూ.లక్ష ఎన్టీపీసీ ప్రాంతంలోని రజకులకు మంజూరయ్యాయని డివిజన్ కార్పొరేటర్ శ్రీనివాస్, శారద తెలిపారు. రజక సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బందోబస్తు మధ్య బోనాలు..

ధర్మారం: మండలంలోని పత్తిపాకలో ఆదివారం పోలీస్ బందోబస్తు మధ్య పోచమ్మ బోనాలు ప్రశాంతంగా జరిగాయి. నెలక్రితం గ్రామంలో నూతనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఇందులో భాగంగానే బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠను గ్రామ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిష్ఠించారు. కాగా అంబేడ్కర్ విగ్రహం సమీపంలో బొడ్రాయి విగ్రహాన్ని ప్రతిష్ఠించరాదని సంఘం నాయకులు అభ్యంతరం తెలిపారు. దీంతో మండలస్థాయి అధికారులు ఇరువర్గాలతో చర్చించి సమస్య పరిష్కరించారు. కాగా బోనాల సందర్భంగా ఘర్షణలు జరగకుండా ముందస్తుగా ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. సర్పంచ్ బద్దం సుజాత ఇంటి నుంచి మహిళలు బోనాలతో ఆలయం వరకు తరలివెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, ఉపసర్పంచు బండారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థి సమస్యలు పరిష్కరించిన ఘనత ఏబీవీపీదే



జెండా ఆవిష్కరణలో నాయకులు

సుల్తానాబాద్: రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలు పరిష్కరించిన ఘనత ఏబీవీపీకే దక్కిందని ఏబీవీపీ హాస్టల్స్ జిల్లా కన్వీనర్ రాసూరి ప్రవీణ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నాగచంద్ర, నాయకులు రోహిత్, రాజేశ్, శ్రీను, అభిరామ్, సందీప్, వినయ్, ఉదయ్, మణిదీప్, ప్రదీప్, అన్వేష్, జయకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేకనే చౌకబారు ఆరోపణలు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌పై కాంగ్రెస్ నాయకులు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు తానిపర్తి గోపాల్‌రావు, జేవిరాజు ఆరోపించారు. పట్టణంలోని ప్రధాన చౌరస్తాలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 60ఏళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి ప్రస్తుతం నియోజకవర్గంలో చేస్తున్నారన్నారు. ప్రజల్లో నానాటికీ పెరుగుతున్న అభిమానాన్ని తట్టుకోలేక, ఓటమి భయంతోనే దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అనవసర ఆరోపణలు చేస్తే రాబోయే కాలంలో ప్రజలే తగిన గుణపాఠం చెప్తారన్నారు. సమావేశంలో నాయకులు వంగ శ్రీనివాస్‌గౌడ్, నడిపెల్లి మురళీధర్‌రావు, తోడేటి శంకర్, నారాయణదాసు మారుతి, జావిద్‌పాషా, చెలుకపల్లి శ్రీనివాస్, మేడి సదానందం, నీరటి శ్రీనివాస్, మండ రమేశ్, అచ్చ వేణు, కలువల సంజీవ్, పిల్లి రమేశ్, కాంపెల్లి సతీశ్, దాసరి ఎల్లయ్య, అక్షర మల్లేశ్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి



పెద్దపల్లిరూరల్: దీక్షకు మద్దతుగా బీజేపీ నేతలు



సంఘీభావం ప్రకటిస్తున్న సీఐటీయూ నాయకులు

పెద్దపల్లిరూరల్: పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న కార్మికుల పనిభారాన్ని తగ్గించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దుపరచడంతో పాటు ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలారపు పర్వతాలు డిమాండ్ చేశారు. పెద్దపల్లి అమరవీరుల స్తూపం వద్ద నాలుగురోజులుగా కొనసాగుతున్న కార్మికుల సమ్మెకు ఆదివారం మద్దతు తెలిపారు. నాయకులు ఖాజా, సంతోష్, శ్రీనివాస్, రాజం మహంత, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, వీరేశం, వేణు పాల్గొన్నారు.

సీఐటీయూ సంఘీభావం

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి చేపడుతున్న పంచాయతీ కార్మికుల దీక్షకు ఆదివారం సీఐటీయూ సంఘీభావం ప్రకటించింది. సీఐటీయూ ప్రతినిధులు రామాచారి, శ్రీనివాస్‌గౌడ్, సురేశ్, శంకర్, విద్యాకర్, రాజ్‌కుమార్, లక్ష్మి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పథకాలపై ఇంటింటా ప్రచారం

సుల్తానాబాద్‌రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం చేయాలని ఎంపీపీ బాలాజీరావు కోరారు. సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల, ఐతరాజుపల్లి గ్రామాల్లో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.